ఆస్తి పన్ను 65.81 శాతం వసూలు

కమిషనర్ పద్మావతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలు 65.81 శాతం వసూలయ్యాయని కమిషనర్ కెవి. పద్మావతి తెలిపారు. మండళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పట్టణ పరిధిలో 14,355 అసెస్మెంట్‌లు ఉండగా వీటిలో పాతబకాయలు రూ.2.23 కోట్లు, ఈ ఏడాది బకాయిలు రూ.4.94 కోట్లు వెరసి రూ.7.17 కోట్లు ఉన్నాయన్నారు. వీటిలో రూ.4.72 కోట్లు వసూలయిందన్నారు. పన్నుల వసూలులో జిల్లా లోని 6 మున్సిపాలిటీలలో పెద్దాపురం మున్సిపాలిటీ 3వ స్థానంలో, మున్సిపల్ రీజియన్‌లో 8వ స్థానంలోనూ, రాష్ట్రంలో 46 వ స్థానంలోనూ నిలిచిందన్నారు.

రేషన్‌లో కందిపప్పు కోత

- అస్తవ్యస్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ
- పేదలకు తప్పని అవస్థలు
- మార్కెట్లో భగ్గుమంటున్న ధరలు
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కూటమి ప్రభుత్వ పాలనలోనూ సామాన్య ప్రజానీకానికి సమస్యలు తప్పడం లేదు. వైసిపి పాలనలో ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మార్చేసిందని ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అయితే చంద్రబాబు సారథ్యంలో అధికారం చేపట్టిన ప్రభుత్వం కూడా ఇదే రీతిన వ్యవహరిస్తుందని పేదలు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. కనీసం కందిపప్పు కూడా పంపిణీ చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని నెలలుగా కందిపప్పు అరకొరగానే సరఫరా చేస్తున్నారు. ఈ నెలలో ఒక్క కిలో కేటాయింపులు జరగలేదు.

జిల్లాలో 6,45,811 బియ్యం కార్డులుండగా 1,060 రేషన్ షాపుల పరిధిలో 420 ఎండియు వాహనాల ద్వారా నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ జరుగుతుంది. సుమారు 650 టన్నుల కందిపప్పు అవసరం ఉంటుంది. గత నెల 250 టన్నులు మాత్రమే సరఫరా జరిగింది. ఫిబ్రవరి నెలలో ఒక్క కిలో కూడా లబ్ధిదారులకు చేరలేదు. జనవరిలో కందిపప్పు జిల్లాకు చేరలేదు. ప్రజా పంపిణీ వ్యవస్థలో బియ్యం, పంచదార మినహా కందిపప్పు సక్రమంగా పంపిణీ జరగడం లేదు. గత ప్రభుత్వ హయాంలో కేవలం బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో పంపిణీ జరిగింది. కందిపప్పు అరకొరగానే అందజేశారు. గతంలో పండుగల వేళ కొన్ని సరుకులను అందించేవారు. క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. గత టిడిపి పాలనలో ఇవి పక్కాగా అమలు చేశారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ కానుకలు పునరుద్ధరిస్తారని లబ్ధిదారులు ఆశించారు. క్రిస్మస్, సంక్రాంతి పండగలు పోయి ఇటీవల రంజాన్ కూడా గడిచిపోయింది. కానీ కానుకల పంపిణీ ఊసెత్తడం లేదు. కనీసం కందిపప్పు పంపిణీని పట్టించుకోవడం లేదు. కొన్ని నెలలుగా 20 నుంచి 50 శాతం మంది లబ్ధిదారులకు మాత్రమే కందిపప్పు పంపిణీ జరుగుతుంది. పట్టణ ప్రాంతాల్లో సగం మందికి ఇస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు కోత తప్పడం లేదు.

కోత ఇలా...

కందిపప్పు కోత గత కొంతకాలంగా జరుగుతుంది. ప్రతీ నెలా 650 టన్నుల కందిపప్పు సరఫరా కావాల్సి ఉంది. గతేడాది జనవరి నుంచి పరిశీలిస్తే జనవరిలో 188 టన్నులు, ఫిబ్రవరిలో 40.185, మార్చి, ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబరులలో ఒక కిలో కూడా ఇవ్వలేదు. అక్టోబరులో 99 టన్నులు, నవంబరులో 420 టన్నులు, డిసంబరులో 427, ఈ ఏడాది జనవరిలో 147, ఫిబ్రవరిలో 108 టన్నులు, మార్చిలో 225 టన్నులు మాత్రమే ఇచ్చారు. ఈనెలలో ఇంకా చేరలేదు. దీంతో ఇక వచ్చే పరిస్థితి కూడా లేదు.

భగ్గుమంటున్న ధరలు

కందిపప్పు ధర మార్కెట్‌లో ప్రస్తుతం కిలో రూ.180 నుంచి 200 వరకు ఉంది. రేషన్ షాపులలో కిలో కందిపప్పు రూ.67 కి లభిస్తుంది. అయితే ప్రభుత్వ విధానాల వలన కందిపప్పు సహా గత కొన్నేళ్లుగా ధరల బాదుడు ఎక్కువయింది. అన్ని రకాల నిత్యవసర సరుకులు ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. పెసర, శెనగ, మినప తదితర పప్పుల ధరలూ మండుతున్నాయి. దీంతో పేదల ఇళ్లల్లో పప్పులు ఉడకని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పలు నిత్యావసర సరుకులను రేషన్ షాపుల్లో పంపిణీ చేయాలని ప్రజల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇచ్చే అరకొర కందిపప్పు రేషన్ షాపుల్లో పంపిణీ చేయకపోవడంతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేద, మధ్యతరగతి వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి.

కందిపప్పు సరఫరా చేయాలి

గత కొన్ని నెలలుగా రేషన్ షాపుల్లో కందిపప్పు ఇవ్వడంలేదు. గత నెలలో సగం మందికి ఇచ్చినా ఈనెలలో రాదని చెబుతున్నారు. పంపిణీదారులను అడుగుతుంటే ప్రభుత్వం నుంచి సరఫరా లేదని చెబుతున్నారు. బయట మార్కెట్లో ధరలు విపరీతంగా ఉన్నాయి. మాలాంటి పేదలు బయట కొనుగోలు చేయలేకపోతున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి కందిపప్పు, ఇతర నిత్యావసర సరుకులను అందివ్వాలి.

ఎ.వెంకటలక్ష్మి, గృహిణి, సామర్లకోట

పూర్తిస్థాయిలో ఇవ్వాలి

రేషన్ షాపుల్లో గతంలో పలు రకాల సరుకులు ఇచ్చేవారు. ప్రస్తుతం బియ్యం, పంచదార మినహా మిగిలిన సరుకులు ఇవ్వడం లేదు. పండుగ వేళల్లో కానుకలు ప్రభుత్వం మర్చిపోయింది. కూటమి సర్కారు వెంటనే స్పందించి ప్రజాపంపిణీ వ్యవస్థలో పూర్తిస్థాయి సరుకులను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

చెల్లి లోవకుమారి, గృహిణి, గొల్లప్రోలు

ఇంకా కందిపప్పు రాలేదు

గత నెలలో 250 టన్నుల కందిపప్పు సరఫరా చేశాం. ఈనెలలో ఇంకా కందిపప్పు జిల్లాకు చేరుకోలేదు. జిల్లాలో 6.43 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతీ నెలా 650 టన్నుల కందిపప్పు పంపిణీ చేస్తున్నాం. వచ్చిన వెంటనే కిలో రూ.67 చొప్పున అందజేస్తాం.

ఎం.దేవులనాయక్, మేనేజర్, పౌరసరఫరాల సంస్థ, కాకినాడ.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి వీరపాండ్యన్

వేసవి కార్యాచరణ అమలుకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

రానున్న మూడు నెలల్లో జిల్లాలో చేపట్టిన ఇంజనీరింగ్ పనులను ముమ్మరంగా నిర్వహించాలని, పటిష్ఠమైన వేసవి కార్యచరణ అమలు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషర్ జి.వీరపాండ్యన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, వివిధ శాఖల జిల్లా అధికారులుతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల సిఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో జిల్లా అభివృద్ధికి సంబంధించి చేసిన ప్రెజెంటేషన్ అంశాలను కలెక్టర్ షాన్‌మోహన్ ఆయనకు వివరించారు. అనంతరం వీరపాండ్యన్ మాట్లాడుతూ సిఎం సమీక్షా నివేదికలో పొందు పరచిన లక్ష్యాల సాధనకు ఆయా శాఖల అధికారులు అంకిత భావంతో కృషి చేసి జిల్లాను అన్నింటా ముందు నిలపాలని కోరారు. ప్రతీ 3 నెలలకొకసారి జిల్లా ప్రగతిని సిఎం సమీక్షించ నున్నందున, వార్షిక లక్ష్యాన్ని త్రైమాసాల వారిగా లక్ష్యాలుగా విభజించుకుని ప్రణాళికా బద్ధంగా వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ ఇంజనీరింగ్ శాఖలు చేపట్టిన నిర్మాణ, నిర్వహణ పనులను వానాకాలం మొదలైయ్యే లోపు సాధ్యమైనంత ఎక్కువగా పూర్తి చేయాలన్నారు రానున్న 3 నెలల్లో పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ పనులు చేపట్టి, కూలీలకు పనులు కల్పించాలని కోరారు. అయితే వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని పనులను ఉదయం 11 గంటలలోపు, మధ్యాహ్నం 4 గంటల తరవాత మాత్రమే చేయించాలని సూచించారు. రానున్న వేసవి మాసాల్లో ప్రజలకు త్రాగునీటి సరఫరా అత్యంత ప్రాధాన్యతాంశంగా ఉందని సంబంధిత శాఖల అధికారులు సన్నద్ధం కావాలన్నారు. నీటి ఎద్దడి ఎదురైయ్యే ఆవాసాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వృద్దులు, పిల్లలు వడదెబ్బకు గురికుండా జాగ్రత్తలు పాటించేలా సూచించాలని, వడగాడ్పుల వల్ల ఎక్కడా మరణాలు జరుగకుండా చూడాలని కోరారు. దాతల సహకారంతో జిల్లా వ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి చల్లని నీరు, మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో మొదలైన రబీ పంటల కోతలను త్వరితగతిన పూర్తి చేసి, వేసవి అపరాల పంటలు, తదుపరి ఖరీఫ్ పంటల సాగు సకాలంలో చేపట్టాలా రైతులకు సూచనలు జారీ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, మున్సిపల్ కమిషనర్ భావన, డిఆర్ఓ జె.వెంకట్రావు, జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, డ్వామా పీడీ పి.వెంకటలక్ష్మి, డిఇఒ పి.రమేష్, డిఎంహెచ్ఒ జె.నరశింహనాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో నిరసన

ప్రజాశక్తి - కాకినాడ

ఆర్థిక బకాయిలు సత్వరమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం 3 గంటల నుంచి కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. సిపిఎస్, జిపిఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 12వ పిఆర్‌సికి కమిషన్‌ను నియమించాలని, ఈలోగా 30 శాతం మధ్యంతర భృతిని ఇవ్వాలని, 11వ పిఆర్‌సి బకాయిలు, డిఎ బకాయిలను, సరెండర్ లీవు బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలన్నారు. కావున అధికసంఖ్యలో ఉపాధ్యాయులు, ఫ్యాప్టో సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు. జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ కెకె.విశ్వనాథ్, సెక్రటరీ జనరల్ సిహెచ్.సూరిబాబు ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

వినికిడి యంత్రాన్ని పెడుతున్న మంత్రి సుభాష్

మహిళల ఉపాధి కల్పనకు కృషి

ప్రజాశక్తి - కాజులూరు

మహిళలకు ఉపాధి, నిరుద్యోగ నిర్మూలనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వికలాంగులకు ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, పింఛన్ల పంపిణీ, ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సుభాష్ మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం బిసి కార్పొరేషన్ ద్వారా ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలను ప్రారంభిస్తుందన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 6 ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే రామచంద్ర పురంలో 2 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. 3 నెలలపాటు శిక్షణలో 75 శాతం హాజరు కలిగిన మహిళలకు కుట్టు మిషన్‌ను ఉచితంగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఇడి ఎ.శ్రీనివాస్, జిల్లా సర్వ శిక్ష అభియాన్ పిఒ పి.వేణుగోపాలరావు, తహశీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపిడిఒ రాంబాబు, ఎంపిపి భారతి, కాజులూరు, సిరిపురం డిసిలు లకాని కృష్ణచైతన్య, పేపకాయల నారాయణరావు, మాజీ ఎంపిపి కృష్ణారావు, స్థానిక నాయకులుపాల్గొన్నారు

కార్టూన్ 'నిజం'



ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - కాకినాడ

2024-25 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ మొదటి వారంలోనే ఉపాధి హామీ పనులు ప్రారంభించి వేసవి మూడు నెలలు పూర్తిస్థాయిలో పనులు చెప్పాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం సంఘం జిల్లా కమిటీ సమావేశం స్థానిక సుందరయ్య భవన్లో టి.ఈశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం నత్తనడక నడుస్తుందని, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు తగ్గించడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించారు. గత 3 నెలలుగా జిల్లాలో ఉపాధి హామీ పనులు నామామాత్రంగా జరిగాయని, చేసిన పనులకు కూడా డబ్బులు విడుదల కాలేదని అరాంరకె, దీంతో కూలీలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీలో కూలీ చాలా తక్కువగా ఉందని, కూలి ధరలు పెంచాలని ఎప్పటినుండో వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేవలం ఏడు రూపాయలు పెంచి రూ.307గా కూలిని నిర్ణయించిందని అన్నారు. కనీసం ఇకనుంచి అయినా కచ్చితంగా రూ.307 రూపాయలు కూలీలకు అందేటట్టు ప్రభుత్వం చూడాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ చట్టంలో కూలీలకు అనేక హక్కులు ఉన్నా అవి ఏవీ అమలు కావడం లేదని కచ్చితంగా చట్టంలో ఉన్న సదుపాయాలన్నీ కూలీలకు కల్పించాలని, ఉపాధి హామీ మేట్లకు పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూరాకుల సింహాచలం, ఉపాధ్యక్షులు దుప్పి అదృష్టదీపుడు, చొల్లంగి వెంకటలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు రుద్రవరపు భూలోకం, పొట్లకాయల కృష్ణ, గోడి భాస్కరరావు, యు.బుల్లబ్బాయి, కె.రాఘవ, డి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సమావేశంలో చర్చిస్తున్న సంఘం నాయకులు

ముగిసిన 10వ తరగతి పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ

10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఏడాది పాటు అన్నీ మరచి అవిశ్రాంతంగా చదివిన విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఉత్సాహంగా పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. గత నెల 17 నుంచి పరీక్షలు మొదలై మంగళవారంతో ముగిశాయి. ఆయా పరీక్షా కేంద్రాల్లో ఉదయ 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించిన సదరు పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 28,963 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో బాలురు 14646 మంది, బాలికలు 14317 మంది ఉన్నారు. 142 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. పరీక్షలు సక్రమంగా నిర్వహించేందుకు 6 ఆకస్మిక, 24 సిట్టింగ్ తనిఖీ బృందాలను నియమించారు. జిల్లాలో ఎటువంటి మాల్ ప్రాక్టీసు, డిబార్ సంఘటనలు చోటుచేసుకోలేదని డిఇఒ పి.రమేష్ తెలిపారు. పరీక్షలు సజావుగా సక్రమంగా ప్రశాంత వాతావరణంలో ముగిశాయని డిఇఒ వెల్లడించారు.

ప్రవీణ్ మృతిపై శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - కిర్లంపూడి, ఏలేశ్వరం

పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల అనుమానస్పద మృతిపై క్రైస్తవ సంఘాలు మంగళవారం కిర్లంపూడిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆర్‌సిఎం, సెయింట్ పాల్ లూథరన్ చర్చ్, ఇమ్మానుయేలు ప్రార్థనా మందిరాలకు చెందిన సంఘీయులు శాంతి ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక స్థానిక ఎస్‌సి పేట నుంచి ప్రారంభం అయిన ర్యాలీ ఏనుగు వీధి సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసి మోకాళ్ళపై నిల్చుని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు కట్టు సూరిబాబు, మద్రా చిట్టిబాబు, మురా చంటిబాబు, కట్టు నాని, సాదే బాబ్జి, గుద్దాడి శ్రీను, పెద్దసంఖ్యలో క్రైస్తవ సంఘీయులు పాల్గొన్నారు. అలాగే ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ జయరాజ్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ఉన్న అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ పాల్ చర్చ్ ఛైర్మన్ గుడాల దైవసహాయం, కొండ్రు ప్రభాకర్‌రావు, గొడుగు నాగభూషణం, జై భీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

నీటి తొట్ల నిర్మాణానికి శంకుస్థాపనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం మండల పరిధిలోని 23 గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో పశువుల మంచినీటితొట్లు నిర్మిస్తున్నారని ఎంపిడిఒ డి.శ్రీలలిత అన్నారు. మంగళవారం మండలంలోని వడ్లమూరు గ్రామంలో నీటి తొట్టి నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సుధీర్, పంచాయతీ కార్యదర్శి సతీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలో నీలాద్రి రావుపేట గ్రామంలో సర్పంచ్ ములంపాక సురేష్ ఆధ్వర్యంలో నీటి తొట్టెలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు కురుకూరి వీర వెంకటచౌదరి, ఎపిఒ గంగాభవాని, ఎంపిటిసి సభ్యులు ఎంపీటీసీ దారబల్ల శివగోవిందు, కార్యదర్శి తరంగిణి, కూటమి పార్టీ నాయకులు, పాల్గొన్నారు. **కరప** స్థానిక పశువైద్యశాల వద్ద పశువుల తొట్టు నిర్మాణానికి జనసేన నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగిరెడ్డి గంగాధర్, మండల పార్టీ అధ్యక్షుడు బండారు మురళి, ఎంపిడిఒ ఎం.అనుపమ పాల్గొన్నారు. 23 గ్రామాల్లోనూ నీటి తొట్లు నిర్మాణం చేస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాది ఆశాజ్యోతి, కార్యదర్శి నిర్మలకుమారి, జనసేన నాయకులు పేకేటి దుర్గాప్రసాద్, గంటగాని బాబు పాల్గొన్నారు.

గండేపల్లిలో భూమి పూజ చేస్తున్న నాయకులు

కరపలో భూమి పూజ చేస్తున్న నాయకులు

శ్రీనివాసరావును సత్కరిస్తున్న స్కూల్స్ యాజమాన్య ప్రతినిధులు

అసోసియేషన్ ఛైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

పేద విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపు చేసేందుకు ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యులుగా నియమితులైన ప్రయివేటు స్కూల్ అసోసియేషన్ ఛైర్మన్ దాసరి శ్రీనివాసరావును ప్రయివేట్ స్కూలు యజమానులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర రాంబాబు మాట్లాడుతూ ప్రయివేటు విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు కేటాయింపు పర్యవేక్షణ కోసం దాసరి శ్రీనివాసరావుకు చోటు కల్పించడం హర్షనీయమన్నారు. కార్పొరేట్ శక్తుల ప్రవేశంతో చిన్న పాఠశాలలు యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రయివేటు విద్యాసంస్థల యొక్క సాధక, బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు డివివి.సత్యనారాయణ, తిరగటి విజయబాబు, పైల రాణాప్రతాప్, చలంచర్ల రత్నాజి పాల్గొన్నారు.

విశ్రాంత జీవితం ఆనందంగా గడపాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఉద్యోగులను సత్కరిస్తున్న ఎస్‌పి బిందుమాధవ్

పోలీసు శాఖలో సుదీర్ఘ కాలం ఉద్యోగ విధులు నిర్వహించి పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితం ఆనందంగా గడపాలని ఎస్‌పి బిందుమాధవ్ ఆకాంక్షించారు. 1987 సంవత్సరానికి చెందిన ఎస్ఐ, 1984, 1989 సంవత్సరాలకు చెందిన ఇద్దరు హోంగార్డుల పదవీవిరమణ సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సుధీర్ఘకాలం పోలీసు విధులు నిర్వర్తించిన ఆయా ఉద్యోగుల విశ్రాంత జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను అతిత్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, పోలీస్ యూనియన్ సభ్యులు, పదవీ విరమణ చేసిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడికను తొలగించేలా చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

వేసవి అనంతరం వచ్చే వర్షాలకు నగరం ముంపు బారిన పడకుండా ఉండేలా తక్షణమే డ్రెయినేజీల్లో పూడికను తొలగించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వర్షాలకు ముందు పూడికలు తీయించడం వలన ప్రయోజనం ఉండదని అన్నారు. నగరంలోని 50 డివిజన్లలో మురుగు కాలువల్లో పూడిక పెద్దఎత్తున పేరుకు పోయిందన్నారు. ముంపు నివారణ పట్ల యాక్షన్ ప్లాన్‌ను వేసవిలో చేపట్టకుంటే మధ్యంతరంగా కురిసే వర్షాల్లోనూ నగరం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక 31వ వార్డులో ఒక వీధిలో మెయిన్ పైప్‌లైన్ లేక తాగునీటికి ఇబ్బందులు పడతున్నామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వార్డుకు చెందిన పలువురు మహిళలు వీధి కుళాయి వద్ద ఇబ్బందులను మీడియాకు వివరించారు. తమ వీధిలో ప్రధాన పైప్‌లైన్ లేకపోవడంతో ఇళ్లలో కుళాయిలు ఏర్పాటు చేసుకోవడం కుదరటం లేదన్నారు. ఉన్న ఒక్క పబ్లిక్ కుళాయి నుంచి వస్తున్న నీరు సరిపడక ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. తమ ఇబ్బందులను మున్సిపల్ అధికారులు గమనించి ప్రధాన పైపులైను ఏర్పాటు చేసి, మరో పబ్లిక్ కులాయిని ఏర్పాటు చేయాలని కోరారు.

ఆదిత్యలో వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్యలో అమెజాన్ వెబ్ సర్వీస్ క్లౌడ్ స్టోరేజ్‌పై 5 రోజుల వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభం అయింది. ఎపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెక్నికల్ స్కిల్ ట్రైనర్ జుతుకా లోవబాబు శిక్షణ ఇచ్చారు. ఎడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక టెక్నాలజీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో.చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ రమాశ్రీ, డీన్ డాక్టర్ సంజయ్ డోలా, విభాగాధిపతి డాక్టర్ ఎం.వంశీకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

బిల్డింగ్ కార్మికుల సంక్షేమ బోర్డుకి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు వడ్డి ఏడుకొండలు డిమాండ్ చేశారు. మంగళవారం బిల్డింగ్ కార్మికుల సంఘాల సమావేశంలో వారు పాల్గొని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా కార్మికుల సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించలేదన్నారు. వైసిపి పాలనలో సంక్షేమ బోర్డుని నిర్వీర్యం చేసి కార్మికుల నోటిలో మట్టి కొట్టిందన్నారు. ఈ నేపథ్యంలోనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకున్న కూటమి పార్టీలు నేడు అధికారంలోకి వచ్చాక ఆ హామీని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర బడ్జెట్లో బిల్డింగ్ కార్మికులకు ఊసు ఎత్తలేదన్నారు. ఇప్పటికైనా కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని వారు కోరారు.

నేరాలు ఘోరాలు

పెన్షన్ సొమ్ములుతో సచివాలయ ఉద్యోగి పరారీ

ప్రజాశక్తి - పిఠాపురం

పురపాలక సంఘ కార్యాలయ పరిధిలో ఆరో సచివాలయ శానిటేషన్ సెక్రెటరీ వై.వెంకట రమణ పెన్షన్ సొమ్ముతో పరారైన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే స్థానిక ఆరో సచివాలయం శానిటేషన్ సెక్రెటరీ వెంకటరమణ సి6,సి7 క్లస్టర్లలోని ప్రజలకు పెన్షన్ పంపిణీ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ నెలకు సంబంధించి రూ.1,82,000 గాను 31వ తేదీన రాత్రి రూ.32000 నగదు వార్డు అడ్మిన్ సెక్రెటరీ ఎస్.రవి వద్ద ఉంచి మిగిలిన రూ.లక్ష 50 వేలు నగదు తీసుకువెళ్ళారు. మంగళవారం ఉదయం పెన్షన్ పంపిణీ ఉదయం 7 గంటల ప్రారంభ కావాల్సి ఉండగా పెన్షన్ పంపిణీ ప్రారంభించకపోవడంతో వెంకటరమణకు కాల్ చేయగా పని చేయలేదు. దీంతో పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ అవకుండా వెంకటరమణ పరారయ్యారని గుర్తించి పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో కమిషనర్ ఎన్ కనకారావు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకు చోరీ

ప్రజాశక్తి - గోపాలపురం

ఇంటి ముందు పార్క్ చేసిన బైకును గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు బాధితుడు మహ్మద్ రజ్జాల కురేషీ మంగళవారం తెలిపారు. స్థానిక బీసీ కాలనీకి చెందిన షేక్ రజ్జాల చిరువ్యాపారి. గోపాలపురం నుంచి గుడ్డిగూడెం వెళ్లే రోడ్డులో మసీదు ఎదురుగా ఆర్ అండ్ బి రోడ్డు ఆనుకుని ఉన్న తన నివాసం ముందు శుక్రవారం రాత్రి బైకును పార్క్ చేశాడు. రంజాన్ మాసం కావడంతో శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో లేచి చూడగా తన బైక్ అదృశ్యమైంది. దీంతో ఆయన పోలీసుకు ఫిర్యాదు చేశారు.

కుమార్తెపై అత్యాచారం కేసులో తండ్రికి యావజ్జీవం

ప్రజాశక్తి - చాగల్లు

కుమార్తెపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడు నక్కా సత్యనారాయణపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ మంగళవారం ఏలూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎన్.ఉమాసునంద తీర్పునిచ్చారని, బాధితురాలికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని ఆదేశించారని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. చాగల్లు మండలం కలవలపల్లి గ్రామ శివారు రామచంద్రపురంలో నివాసం ఉండే నక్కా సత్యనారాయణ తన కుమార్తెపై 2020లో అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె గర్భం దాల్చింది. బాధితురాలి ఫిర్యాదుపై అప్పటి ఎస్ఐ జి.జి.విష్ణువర్ధన్ కేసు నమోదు చేశారు. అప్పటి కొవ్వూరు డిఎస్పి రాజేశ్వర్రెడ్డి దర్యాప్తు చేశారు. నిందితుని అరెస్టు చేసి రిమాండ్కు పంపారు. విచారణ అనంతరం ఛార్జిషీట్ను ఫైల్ చేశారు. నేరం రుజువు కావడంతో యావజ్జీవం విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్ఐ తెలిపారు.

కాలువలో దిగిన విద్యార్థి మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాయన్న సంతోషంతో ముగ్గురు విద్యార్థులు కాలువలో స్నానానికి దిగారు. ప్రమాదవశాత్తు ఒక విద్యార్థి గల్లంతై మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రపురం పట్టణంలోని యువ నగర్కు చెందిన యలమంచిలి అఖిల్ (15) స్థానికంగా పిల్లాని స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం పరీక్షలు పూర్తి కావడంతో తన స్నేహితులతో కలిసి వెల్ల పంట కాలువ లాకుల వద్దకు స్నానానికి వెళ్లారు. పంట కాలువలో దిగి ఉధృతంగా ఉండటంతో ప్రవాహ వేగానికి అఖిల్ కొట్టుకుపోయాడు. సాయంత్రం మృతదేహం లభ్యమయింది. పదో తరగతి పరీక్షలు పూర్తయిన ఆనందం ఒక పూట కూడా గడవకముందే విద్యార్థి మృత్యు కౌగిలికి చేరుకోవడంతో అతని స్నేహితులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు.

సిఎం రిలీఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని 17వ వార్డుకు చెందిన లబ్ధిదారు మన్యం సీతామహాలక్ష్మికి మంజూరు అయిన రూ.4,37,720 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎంఎల్ఎ చినరాజప్ప మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

దంత సమస్యలపై ప్రజలకు అవగాహన అవసరమని దంత వైద్యులు సిహెచ్.ఇందిరా ప్రియదర్శిని అన్నారు. మంగళవారం ప్రపంచ దంత ఆరోగ్య భద్రత కార్యక్రమంలో భాగంగా స్థానిక పిహెచ్సిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దంత సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నోటి ఆరోగ్య సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సునీతమెర్సీ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతరం డ్రోన్ నిఘా

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో నిరంతరం డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు సిఐ కృష్ణభగవాన్ అన్నారు. మంగళవారం స్థానిక మరిడమ్మ సెంటర్ వద్ద ట్రాఫిక్ రద్దీ ప్రాంతంలోను, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న 10వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు డ్రోన్ కెమెరాను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా ట్రాఫిక్ రద్దీ కూడళ్లలో, పాఠశాలలు, కళాశాల పరిసరాల్లో నేరాలు, ఈవ్టీజింగ్ అదుపునకు ఈ డ్రోన్ ద్వారా నిఘాను పెడుతున్నట్లు చెప్పారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఎపి గరగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దుపై కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్రంలో ఆప్కాస్ రద్దు చేయడంపై సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆప్కాస్ స్థానంలో మున్సిపల్ శానిటేషన్ వర్కర్లను, ఇంజినీరింగ్ వర్కర్లను పర్మినెంట్ చేస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అప్కాస్ను రద్దు చేయడం దారుణమన్నారు. అప్కాస్లో వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని, ఆయా కుటుంబాలను రోడ్డున పడేయడం మానుకోవాలన్నారు. ఆప్కాస్ స్థానంలో ప్రయివేటు ఏజెన్సీలను తీసుకొచ్చే ఆలోచనతోనే ఈ విధమైన చర్యకు ప్రభుత్వం దిగజారిందని ఆరోపించారు. ఈ ఆలోచనలు విరమించుకోవాలని, మున్సిపల్ శానిటేషన్, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శికోటి అప్పారావు, వర్రె గిరిబాబు, సింగంపల్లి సింహాచలం, వర్రె వెంకటరమణ, ప్రభాకర్, సురేష్, మడికి రమేష్, ముత్యాల వెంకటసత్య నారాయణ, ముత్యాల దుర్గ, సింగంపల్లి పైడమ్మ, వర్రె భవాని, మడికి మోహన్ రావు, నేదునూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న అప్కాస్ కార్మికులు

'వైసిపి బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి - రౌతులపూడి

నియోజకవర్గంలో వైసిపిని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి ఇన్ఛార్జ్ ముద్రగడ గిరిబాబు, వైసిపి నాయకుడు యనమల కృష్ణుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వెంకటరమణ రైస్ మిల్ ఆవరణలో నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. నియోజవర్గ బిసి సెల్ అధ్యక్షులు ఎంపికైన సర్పంచ్ సర్జము శ్రీను, ఎస్టి సెల్ అధ్యక్షులుగా ఎంపికైన చెన్నాడా సత్తిబాబును వారు అభినందించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్సి అంగూరి లక్ష్మిశివకుమారి, జడ్పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, వైసిపి నాయకులు వాసిడి జమీలు, సత్యనారాయణ, ఉప సర్పంచ్ భాస్కర్బాబు పాల్గొన్నారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న కృష్ణుడు

రోగుల సౌకర్యార్థం హాలు పునరుద్ధరణ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల బంధువుల సౌకర్యార్థం కాకినాడ కస్టమ్స్ శాఖ నిధులు రూ.10 లక్షలతో పున్ణనిర్మించిన హాలును కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రజా ప్రయోజనం నిమిత్తం సేవా కార్యక్రమాలు చేస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.లావణ్యకుమారి మాట్లాడుతూ భోజనశాల ఆధునీకరించడంతోపాటు, రోగుల బంధువులు వేచి ఉండే ప్రదేశానికి అవసరమైన సాయాన్నికస్టమ్స్ శాఖ అందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ అదనపు కమిషనర్ వై.రామకృష్ణరాజుయాదవ్, అసిస్టెంట్ కమిషనర్ బి.మహేష్బాబు, ఎసి ఎన్.రవికుమార్, సిపిడి సూపరింటెండెంట్ వి.రంగారావు, ప్రివెన్టీవ్ సూపరింటెండెంట్ కె.రమేష్, ఆసుపత్రి అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపిఆర్.విఠల్, హెచ్ఒడి శ్రీనివాస్, వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, ఆసుపత్రి, కస్టమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

యానాంలో చెత్తను ఆంధ్రాలో వేయొద్దు

ప్రజాశక్తి - తాళ్లరేవు

యానం ప్రాంతానికి చెందిన చెత్తను ఆంధ్రాలో వేయొద్దని మండల టిడిపి నాయకులు అన్నారు. మండలంలోని పోలేకుర్రు పంచాయతీ చినబాపనపల్లి సరిహద్దులో యానాంలో చెత్తను తీసుకొచ్చి వేస్తున్నారని మంగళవారం తహశీల్దార్ పి.త్రినాధరావుకు ఫిర్యాదు చేశారు. భవిష్యత్తులో ఆ ప్రాంతం సరిహద్దులో ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, సాగి బాబ్జిరాజు, నడింపల్లి వినోద్, జక్కల ప్రసాద్బాబు, వడ్లమూరి సతీష్, నిమ్మకాయల సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలపై జనసేన అసంతృప్తి

ప్రజాశక్తి - తాళ్లరేవు

బిసి, కాపు కార్పొరేషన్ రుణాల కేటాయింపులపై జనసేన శ్రేణులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాయి. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో కార్పొరేషన్ రుణాలపై కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశం ఉందని సమాచారం ఇవ్వడంతో జనసేన నాయకులు అక్కడికి చేరుకున్నారు. ఈ సమావేశం కేవలం టిడిపికి చెందినదేనని చెప్పడంతో వారు వెనుతిరిగారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు అత్తిలి బాబురావు, విళ్ల వీర మీడియాతో మాట్లాడారు. రుణాల కేటాయింపు విషయంలో తమను సంప్రదించకుండా ఏకపక్షంగా టిడిపి నాయకులు వ్యవహరించారన్నారు. ముందుగా పిలిచి సమన్వయపరిచే పరిస్థితి కనిపించడం లేదన్నారు. మండలంలో మొత్తంగా 154 ఉండగా కేవలం 34 మాత్రమే జనసేన కేటాయించడం అన్యాయమని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు విఆర్ఎన్బి.ప్రసాద్, పోతాబత్తుల రాంబాబు, మత్తుర్తి మణికంఠ, సూరంపూడి కుమార్, కొటికలపూడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కళాకారులతో ముద్రగడ పద్మనాభం, గిరిబాబు

కళాకారులను ఆదరించాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి

కళాకారులను ఆదరించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ మంత్రి, వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం అన్నారు. మంగళవారం తన నివాసంలో ఉగాది పండుగను పురస్కరించుకుని నూకాలమ్మ తల్లి జాతరలో నెల రోజులు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన కళాకారులకు ఆయన దుస్తులు, గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న సాంప్రదాయ పండగలను ప్రోత్సహిస్తున్న కళాకారులను గుర్తించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, కళాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభించిన ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కెవి.పద్మావతి, మరిడమ్మ దేవస్థానం ఎసి విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, నాయకులు చింతల సత్యనారాయణ, రంది సత్యనారాయణ, తూతిక నాగు, కొరుపూరి రాజు, తాడిశెట్టి గంగాధర్ పాల్గొన్నారు. అలాగే సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎంఎల్ఎ చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వైసిపి కౌన్సిలర్లు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. నిధులు తెచ్చి గ్రామాలను, పట్టణాలను అభివృద్ధి పరిచే బాధ్యత తనదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ గవర్నర్ ఈదల యశ్వంత్కుమార్, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, నిమ్మకాయల కిరణ్, కంటే జగదీష్ మోహన్, జనసేన నాయకులు సరోజ వాసు మంచెం సాయిబాబు, పిట్టా జానకి రామారావు, లయన్స్ క్లబ్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చినరాజప్ప, బాబు

ఐక్యత ద్వారానే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - పెద్దాపురం

సభ్యులందరూ ఐక్యతతో ముందడుగు వేయాలని, తద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పప్పు దుర్గారమేష్ అన్నారు. మంగళవారం స్థానిక విశ్వనాథపు బసవరాజు తోటలో మున్సిపల్ కౌన్సిలర్ కట్టా రాజబాబు అధ్యక్షతన పట్టణ పద్మశాలి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి కుటుంబాలు ఎక్కువగా చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. చేనేత పరిశ్రమ సంక్షోభంలో ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నూతన కమిటి ఏకగ్రీవం

నూతన అధ్యక్షులుగా కట్టా రాజబాబు, ఉపాధ్యక్షులుగా కొల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా బెందులూరు స్వామి, సహాయ కార్యదర్శిగా కొండేటి వీరభద్రరావు, కోశాధికారిగా మొండి శ్రీనివాసరావు, సోమశేఖర్, కమిటి సభ్యులుగా దూబా శ్రీనివాస్, వానపల్లి లక్ష్మి, నారెం వెంకటరమణ, శేశెట్టి శ్రీనివాస్, జంజం రాజేష్కుమార్, మల్లేశ్వరరావు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జగ్గారపు మల్లికార్జున్, కొండేటి సత్యనారాయణ, నూకల నరసింహామూర్తి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన విజయశేఖర్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం సిఐగా పి.విజయశేఖర్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సిఐగా విధులు నిర్వహించిన క్రాంతికుమార్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో విజయశేఖర్ బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరంలో క్రైం సిఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం డిఎస్పి శ్రీహరిరాజును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

సిఐ విజయశేఖర్

క్షుద్ర పూజలతో కలకలం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక బ్రౌన్పేట శివారు కందకంలో క్షుద్ర పూజలతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఒక వీధిలో రెండు ఇళ్ల ముందు మంగళవారం ఉదయం ప్రజలు నిద్ర మేల్కొనే సరికి స్టార్ ముగ్గులు వేసి, పసుపు, కుంకుమ వేసి, ముగ్గు మధ్యలో నిమ్మకాయలు పెట్టి ఉండటంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ముగ్గులు వేసి బ్లాక్ మ్యాజిక్ డ్రాయింగ్ అని గుర్తు తెలియని వ్యక్తులు పేరు రాశారు. ఈ సంఘటనను స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షుద్ర పూజ ముగ్గులను పరిశీలించారు. అయితే ఈ క్షుద్ర పూజలు ఆకతాయిలు పనా, లేదంటే ఎవరైనా కావాలని చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
E.A. No. 144/2024
E.P. No. 23/2020
O.S. No. 415/2012
Between:
Karri Venkatesh
...Petitoner/ Claimant
AND
Yedavalli Venkateswara Rao and Others
...Respondent/ DHr/ Plaintiff
2. Nadikolla Veerraju, S/o. Chandra Rao, Hindu, aged 54 years, Padi Commissioner agent, R/o. Nidasanametta Village, Mandapeta Mandal, Dr. B.R.Ambedkar Konaseema District.
...2nd Respondent/ JDr/ Defendant
పై నెంబరు దావాలో మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 15-4-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఆర్.ఎం.కృష్ణ
రాజమండ్రి **ఎం.నీరజ**
01-4-2025 అడ్వకేట్స్, రాజమండ్రి

ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా పర్యవేక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

ఎన్టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు జిల్లా ప్రత్యేక అధికారి, ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండ్యన్ అన్నారు. మంగళవారం మండలంలోని మాధవపట్నం జమున నగర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ షాన్మోహన్, ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి సమక్షంలో ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పింఛన్ల సొమ్ము సక్రమంగా అందుతుందా? ఏ సమయానికి పింఛన్లు ఇస్తున్నారు? పింఛన్లు మీ గృహం వద్దనే ఇస్తున్నారా? పింఛన్ల పంపిణీ చేసే సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారా..? అని లబ్ధిదారులను ఆరా తీశారు. అనంతరం తోలుబొమ్మ కళాకారులతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.70 లక్షలతో నిర్మించనున్న వంతెనకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు పర్యవేక్షణకు జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించిందన్నారు. కలెక్టర్ షాన్మోహన్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పశువులకు అవసరమైన తాగునీరు అందుబాటులో ఉంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 350 నీటి తొట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. 2వేల పశువుల షెడ్లు ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సిసి డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. పింఛన్ల పంపిణీలో సచివాలయం సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప వంతెన నిర్మాణం కోసం కాలనీవాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, వారి ఆశలను నెరవేర్చుతూ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఒ ఎస్.మల్లిబాబు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డిఎంహెచ్ఒ డాక్టర్ జె.నరసింహనాయక్, ఎపిడి వసంత మాధవి, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి, తహశీల్దార్ కె.చంద్రశేఖర్రెడ్డి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేష్బాబు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వీరపాండ్యన్, చినరాజప్ప

పట్టణంలో పర్యటించిన పాడా పీడీ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పిఠాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పీడీ చైత్రవర్షిణి మంగళవారం పట్టణంలో పర్యటించారు. ఈనెల 4న పట్టణంలో జరిగే పలు అభివృద్ధి పనులను ఎంఎల్సి నాగేంద్రబాబు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె నూతనంగా నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రం, రెవెన్యూ కార్యాలయం, అన్న క్యాంటీన్ భవనాలను పరిశీలించారు అనంతరం వాటర్ హౌస్, నగర పంచాయతీ నూతన కార్యాలయ నిర్మాణానికి మార్కెట్ వద్ద గల స్థలాన్ని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పీడీ చైత్రవర్షిణి మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో చేపడతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ, కమిషనర్ ఎం.కనకరావు, ఎఇ ప్రభాకర్, డాక్టర్ అమృతరావు, సిబ్బంది పాల్గొన్నారు

పలు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న చైత్రవర్షిణి

కాంగ్రెస్ పార్టీ పదవులకు ఆమోదం

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురికి పదవులు కట్టబెడుతూ పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డి ఆమోదం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు పట్టణ, మండల స్థాయిలో అధ్యక్షులుగా పలువురిని ప్రతిపాదిస్తూ పిసిసికి నివేదించారు. ఆ నివేదికకు ఆమె మంగళవారం ఆమోదం తెలిపారు. సామర్లకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మాజీ కౌన్సిలర్ సంగినిడి భవన్నారాయణ నియమితులయ్యారు. పట్టణ అధ్యక్షులుగా ఎంపికైన భావన్నారాయణను కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు అభినందించారు. అలాగే పెద్దాపురం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షునిగా తోట కరుణాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి కాంగ్రెస్ పార్టీ తోనే ఉన్నానని, పంతం పద్మనాభం మంత్రిగా ఉండగా తాను పార్టీ అభిమానిగా రాజకీయ జీవితం ప్రారంభించానని, పార్టీ నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, నడిపూడి
టెండరు ప్రకటన
రి.క. నెం.11/2025 తేది.01-04-2025
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలంలోని నడిపూడి గ్రామపంచాయతీ 2025-2026 సం॥రంనకు అవసరమగు ఈ దిగువ చూపిన అయిటం తాలూకు వివిధ విడిభాగములు మరియు మందులు సరఫరా చేయుటకును మరియు వివిధ సేవలు నిమిత్తం సీలు వేసిన టెండర్లు ఈ దిగువ సంతకపు అధికారి వారిచే గాని, వారి అనుమతి పొందిన మరియొకరిచే గాని ది. 07-04-2025వ తేదీ ఉదయం గం॥ 12.00 గం॥ల వరకు తీసుకొని అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షంలో మధ్యాహ్నం గం॥ 12.30లకు సదరు టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయం పని వేళలలో తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరములు	ధరావత్తు
1	2025-2026 సంవత్సరమునకు అవసరమగు ప్రజారోగ్య పనిముట్లు, మందులు సరఫరా చేయుటకు	రూ. 500/-
2	2025-2026 సంవత్సరమునకు అవసరమగు మంచినీటి సరఫరా విడిభాగములు సరఫరా చేయుటకు	రూ. 500/-
3	2025-2026 సంవత్సరమునకు అవసరమగు స్టేషనరి సామానులు సరఫరా చేయుటకు	రూ. 500/-

సం/- **చెల్లుబోయిన వెంకటేశ్వరరావు**
సర్పంచ్, గ్రామపంచాయితీ, నడిపూడి
అమలాపురం మండలం
సం/- **బి.ఎ.ఎస్.లక్ష్మి**
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ
నడిపూడి, అమలాపురం మండలం
గమనిక: 1. గ్రామపంచాయితీ నిధులు నిల్వలను అనుసరించి బిల్లులను వరుస క్రమములో చెల్లించబడును.
2. గ్రామపంచాయితీనకు సరఫరా చేయబడు సామాన్లు మంచి నాణ్యత కలిగి ISI మార్కు కలిగి యుండవలెను.
3. టెండరును ఆమోదించుట గాని, నిరాకరించుటకు గాని పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

గ్రామపంచాయతీ కార్యాలయం, జనుపల్లి
టెండరు ప్రకటన
రి.క. నెం.11/2025 తేది.01-04-2025
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలంలోని జనుపల్లి గ్రామపంచాయతీ 2025-2026 సం॥రంనకు అవసరమగు ఈ దిగువ చూపిన అయిటం తాలూకు వివిధ విడిభాగములు మరియు మందులు సరఫరా చేయుటకును మరియు వివిధ సేవలు నిమిత్తం సీలు వేసిన టెండర్లు ఈ దిగువ సంతకపు అధికారి వారిచే గాని, వారి అనుమతి పొందిన మరియొకరిచే గాని ది. 08-04-2025వ తేదీ మధ్యాహ్నం గం॥ 12.00 గం॥ల వరకు తీసుకొని అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షంలో మధ్యాహ్నం గం॥ 12.30 లకు సదరు టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయం పని వేళలలో తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరములు	ధరావత్తు
1	2025-2026 సంవత్సరమునకు అవసరమగు ప్రజారోగ్య పనిముట్లు, మందులు సరఫరా చేయుటకు	రూ. 500/-
2	2025-2026 సంవత్సరమునకు అవసరమగు మంచినీటి సరఫరా విడిభాగములు సరఫరా చేయుటకు	రూ. 500/-
3	2025-2026 సంవత్సరమునకు అవసరమగు స్టేషనరి సామానులు సరఫరా చేయుటకు	రూ. 500/-

సం/- **శ్రీమతి గాణాల భారతి**
సర్పంచ్, గ్రామపంచాయితీ, జనుపల్లి
అమలాపురం మండలం
సం/- **బి.ఎ.ఎస్.లక్ష్మి**
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ
జనుపల్లి, అమలాపురం మండలం
గమనిక: 1. గ్రామపంచాయితీ నిధులు నిల్వలను అనుసరించి బిల్లులను వరుస క్రమములో చెల్లించబడును.
2. గ్రామపంచాయితీనకు సరఫరా చేయబడు సామాన్లు మంచి నాణ్యత కలిగి ISI మార్కు కలిగి యుండవలెను.
3. టెండరును ఆమోదించుట గాని, నిరాకరించుటకు గాని పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

గ్రామపంచాయతీ కార్యాలయం, నల్లమిల్లి
టెండరు ప్రకటన
రి.క. నెం.11/2025 తేది.01-04-2025
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలంలోని నల్లమిల్లి గ్రామపంచాయతీ 2025-2026 సం॥రంనకు అవసరమగు ఈ దిగువ చూపిన అయిటం తాలూకు వివిధ విడిభాగములు మరియు మందులు సరఫరా చేయుటకును మరియు వివిధ సేవలు నిమిత్తం సీలు వేసిన టెండర్లు ఈ దిగువ సంతకపు అధికారి వారిచే గాని, వారి అనుమతి పొందిన మరియొకరిచే గాని ది. 08-04-2025వ తేదీ మధ్యాహ్నం గం॥ 12.00 వరకు తీసుకొని అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షంలో మధ్యాహ్నం గం॥ 2.30లకు సదరు టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయం పని వేళలలో తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరములు	ధరావత్తు
1	2025-2026 సంవత్సరమునకు అవసరమగు ప్రజారోగ్య పనిముట్లు, మందులు సరఫరా చేయుటకు	రూ. 500/-
2	2025-2026 సంవత్సరమునకు అవసరమగు మంచినీటి సరఫరా విడిభాగములు సరఫరా చేయుటకు	రూ. 500/-
3	2025-2026 సంవత్సరమునకు అవసరమగు స్టేషనరి సామానులు సరఫరా చేయుటకు	రూ. 500/-

సం/- **గోకరకొండ శ్రీనివాసు (వాసు)**
సర్పంచ్, గ్రామపంచాయితీ, నల్లమిల్లి
అమలాపురం మండలం
సం/- **బి.ఎ.ఎస్.లక్ష్మి**
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ
నల్లమిల్లి, అమలాపురం మండలం
గమనిక: 1. గ్రామపంచాయితీ నిధులు నిల్వలను అనుసరించి బిల్లులను వరుస క్రమములో చెల్లించబడును.
2. గ్రామపంచాయితీనకు సరఫరా చేయబడు సామాన్లు మంచి నాణ్యత కలిగి ISI మార్కు కలిగి యుండవలెను.
3. టెండరును ఆమోదించుట గాని, నిరాకరించుటకు గాని పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

పాస్పోర్ట్ పడిపోయినది
అల్లవరం మండలం నక్కా రామేశ్వరం కొమరగిరిపట్నంకు చెందిన చెక్కా మణి W/o. వెర్రియ్య కు చెందిన **R 8279329** నెంబరు కల పాస్పోర్ట్ పడిపోయినది. జిరాక్స్ నిమిత్తము 22-01-2025వ తేదీన నక్కా రామేశ్వరం నుండి కొమరగిరిపట్నం వచ్చుచుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికినవారు క్రింది అడ్రస్కు అందజేయగలరు.
చెక్కా మణి, W/o. వెర్రియ్య
డోర్ నెంబర్ 1-53, నక్కా రామేశ్వరం,
కొమరగిరిపట్నం, అల్లవరం మండలం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ :7794864858

సర్టిఫికెట్స్ పోయినవి
కొత్త కొట్టాం గ్రామం, కోటనందూరు మండలం, కాకినాడ జిల్లాకు చెందిన కడిమి అప్పన్న, S/o. ఏసుబాబు, వయస్సు 29, ఎస్సి మాల, డోర్ నెం. 4-71, కొత్త కొట్టాం నాకు సంబంధించిన 8th, 9th, 10th తరగతులకు సంబంధించిన సర్టిఫికెట్స్ తుని నుండి హైదరాబాద్ ప్రయాణం మీద వెళ్తుండగా మార్గం మధ్యలో నా యొక్క సర్టిఫికెట్స్ పోయినవి. ఇవి ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.
ఇట్లు
కడిమి అప్పన్న, S/o. ఏసుబాబు
కొత్త కొట్టాం, కోటనందూరు మండలం
కాకినాడ జిల్లా, సెల్: 9398746154

ఒరిజినల్ దస్తావేజు పోయినది
మారెళ్ళ బాలమురళీకృష్ణ, C/o. పుష్ప రాజారావు, డో.నెం. 115-10-396, శేషాద్రి హిల్స్, కొంతమూరు, రాజమండ్రి రూరల్, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నాయొక్క ఒరిజినల్ దస్తావేజు నెం. 290/2010, Dt. 21-1-2010 రాజమండ్రి సబ్ రిజిస్టర్ వారి ఆఫీసులో రిజిస్టర్ కాబడిన ఒరిజినల్ దస్తావేజు ది. 24-3-2025వ తేదీన నేను రాజమండ్రి ప్రకాష్నగర్ నందు గల జంబో జిరాక్స్ వద్ద జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా ప్రకాష్నగర్ రౌండ్ పార్కు వద్ద పడిపోయినవి. కనుక ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్కి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.
మారెళ్ళ బాలమురళీకృష్ణ
డో.నెం. 115-10-296, శేషాద్రి హిల్స్
కొంతమూరు, రాజమండ్రి రూరల్
తూ॥గో॥జిల్లా, సెల్: 9394772024

మహారాజశ్రీ అమలాపురం 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. నెం. 163/2024 ఇన్
ఎ.ఎస్.ఎస్.ఆర్. నెం. 812/2024
బిట్వీన్:
బేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి సతీష్రెడ్డి, S/o. సత్యనారాయణ రెడ్డి, హిందు, ఈనాం, వయస్సు 32 సం॥లు, డోరు నెం. 1-226, వెదిరేశ్వరం, రావులపాలెం ***-వాదులు***
మరియు
1. బేతిరెడ్డి యశ్వంత్ రెడ్డి, మైనర్ గార్డియన్ బేతిరెడ్డి సంధ్య, S/o. సత్యనారాయణ రెడ్డి సతీష్రెడ్డి, హిందు, మైనర్, 7 సం॥లు, 6-227, బంగారు పాపమ్మ టెంపుల్, రావులపాలెం ***-1వ రెస్పాండెంట్***
2 బేతిరెడ్డి వెంకటరెడ్డి, S/o. సత్యనారాయణ రెడ్డి, హిందు, ఈనాం, 43 సం॥లు, 1-226, వెదిరేశ్వరం, రావులపాలెం ***-3వ రెస్పాండెంట్***
-ప్రతివాదులు
పై నెంబరు అప్పీలులో ఎ.ఎస్.ఎస్.ఆర్. నెం. 812/2024 లో 1, 3వ రెస్పాండెంట్లకు ఎన్నిమార్లు సమన్లు పంపినను సమన్లు తీసుకొనని కారణముగా కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా నోటీసు అమలు చేయుటకు ఆర్డరు వేసియున్నారు. కనుక పై నెంబరు ఎ.ఎస్.ఎస్.ఆర్. అప్పీలు **ది. 15-04-2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** సదరు కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలియజేయవలెను. లేనిచో అభ్యంతరములు లేవని పరోక్షముగా తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
వాయిదా తేది: 15-04-2025,
సమయం: ఉదయం 10.30 గంటలకు
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
అమలాపురం **ఎస్.వెంకటేశ్వరరావు**
ది.29-3-2025 అడ్వకేట్, కొత్తపేట